క్లుప్తంగా

మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం నేడు

తోటపల్లిగూడూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం మండల పరిధిలో ఎన్నికల ప్రచారం చేస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు పేడూరు, 5 గంటలకు కోవెరపాళెం, 6 గంటలకు పాపిరెడ్డిపాళెం పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం సాగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

దోశ సూపర్



పొదలకూరు : పట్టణంలోని టైలర్స్ కాలనీలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు పక్కన మహిళ నిర్వహిస్తున్న దుకాణంలో మంత్రి కాకాణి టిఫిన్ చేశారు. దోశ చాలా బాగుందని మహిళను అభినందించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

- పట్టణంలో కేంద్ర బలగాల కవాతు



కేంద్ర బలగాల కవాతులో పాల్గొన్న సీఐ, స్థానిక పోలీసులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటామని బుచ్చిరెడ్డిపాళెం సీఐ హైమారావు అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో సీఐ ఆధ్వర్యంలో కేంద్ర బలగాల కవాతు ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఉండేందుకు, ప్రజలకు అవగాహన కలిగించేందుకు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించామన్నారు. ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకుని మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు.

ఏపీజీఈఏ జిల్లా కార్యవర్గ సమావేశం



రమణారెడ్డిని సత్కరిస్తున్న నేతలు

నెల్లూరు(పొగతోట): నగరంలోని ఐఎంఏ హాల్లో ఏపీజీఈఏ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. తాలూకా స్థాయిలో సభ్యత్వాల నమోదు.. తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఏపీజీఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏనుగు రమణారెడ్డిని సత్కరించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, జిల్లా నేతలు అమరేంద్రరెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తిదారుల సదస్సు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో చేతి వృత్తిదారుల సదస్సును కటికాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చేతి వృత్తిదారుల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ మన్నూరు భాస్కరయ్య మాట్లాడారు. చేతి వృత్తిదారులు, వెనుకబడిన తరగతుల ప్రజల కోసం అండగా ఉంటున్న వామపక్షాలకు మద్దతునివ్వాలని కోరారు. వడ్డెర వృత్తి సంఘ రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్, నేతలు బాలవెంకటేశ్వర్లు, రమేష్‌బాబు, అంకయ్య, శ్రీనివాసులు, రజక వృత్తిదారుల సంఘ నేతలు కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, కల్లుగీత కార్మిక సంఘ నేతలు వెంకయ్య, శుభకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రోత్సాహకాల అందజేత

నెల్లూరు(బృందావనం): ఉన్నతంగా ఎదిగేందుకు విద్య ఎంతో ముఖ్యమని రెడ్ల ఐక్యవేదిక అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి పేర్కొన్నారు. కేవీఆర్ పెట్రోల్ బంక్ సమీపంలోని ఓ హోటల్లో రెడ్ల ఐక్యవేదిక శాశ్వత సభ్యుల సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. అనంతరం 10 మంది రెడ్డి విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందజేశారు. గత నెల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమావేశానికి సహకరించిన సంఘ పెద్దలను సత్కరించారు. రెడ్ల ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ బీవీ రెడ్డి, ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు వెండోటి ధనుంజయరెడ్డి, సంయుక్త కార్యదర్శి గుండాల ప్రతాప్‌రెడ్డి, కోశాధికారి హేమంత్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లిలో ప్రగతి పుంతలు

- నియోజకవర్గంలో సమగ్రాభివృద్ధి
- వరదలా నిధులు తీసుకొచ్చిన మంత్రి కాకాణి
- హామీలకే పరిమితమైన గత టీడీపీ ప్రభుత్వం



సర్వేపల్లి రిజర్వాయర్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనులు (ఫైల్)



సర్వేపల్లి నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు

పొదలకూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సర్వేపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పుంతలు తొక్కింది. సర్వేపల్లి సమగ్ర అభివృద్ధికి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రణాళికతో నిధులు సాధించి ఎప్పటి నుంచో ఉన్న పనులను కూడా పూర్తి చేసి చూపారు. గత పాలకులు నాన్ ఫిషర్‌మెన్ ప్యాకేజీని అటకెక్కించినా మంత్రి చొరవ తీసుకుని గతేడాది ఏప్రిల్ మాసంలో వారికి రూ.36 కోట్లను అందజేశారు. దశాబ్దాలుగా రైతులు ఎదుర్కొంటున్న చుక్కల భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. రైతులు సాగు చేసుకుంటున్న భూములతో పాటు, కొనుగోలు చేసి పట్టాలు పొందలేని రైతు భూముల సమస్యలు తొలగిపోయాయి. సర్వేపల్లి నియోజకవర్గంలో సుమారు 9 వేల ఎకరాల అసైన్మెంట్, పీఓటీ భూములకు పట్టాలను మంత్రి కాకాణి అందజేశారు. కొత్తగా పరిశ్రమల రాకతో పాటు, నియోజకవర్గంలో తాగు, సాగునీటి సౌకర్యం, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.90 కోట్లు మంజూరు చేయించి ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. వైఎస్సార్ యంత్రసేవా ద్వారా 147 మంది రైతులకు ట్రాక్టర్లను అందజేశారు.



క్రిబ్కో, విశ్వసముద్ర బయోఇథనాల్ ప్లాంట్లకు వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం జగన్

రైతులకు సాగునీరు

పొదలకూరు మండలం కండలేరు హైలెవల్ కాలువ ఆధునికీకరణకు రూ.39.12 కోట్లు, సర్వేపల్లి రిజర్వాయర్ ఆధునికీకరణకు రెండు ప్యాకేజీల ద్వారా రూ.31 కోట్లను మంత్రి కాకాణి సాధించారు. ఈ పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయి. ఈ సాగునీటి కాలువలు, రిజర్వాయర్ ఆధునీకరణ వల్ల వేలాది ఎకరాలు అదనంగా సాగులోకి వస్తుంది. అంతేకాక కాలువలకు లైనింగ్ పనులు చేపట్టడం వల్ల రైతులకు సకాలంలో సాగునీరు అందుతుంది. సంగం, నెల్లూరు బ్యారేజీల పనులను ప్రభుత్వం పూర్తి చేయడం వల్ల సర్వేపల్లి నియోజకవర్గంలో కనుపూరు కాలువ ద్వారా పొదలకూరు, వెంకటాచలం, మనుబోలు మండలాలకు సక్రమంగా సాగునీరు అందుతోంది.

చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం

జిల్లాలో చుక్కల భూములకు ఒక్క జీఓ ద్వారా శాశ్వత పరిష్కారం లభించింది. జిల్లాలో 23,023 మంది రైతులకు సంబంధించిన 43,270 ఎకరాల చుక్కలు భూములు, 22ఏ నిషేధిత భూములకు సంబంధించి 2,527 మంది రైతులకు 3,756 ఎకరాల భూములకు శాశ్వత పరిష్కారం లభించింది. ఇందులో సర్వేపల్లి నియోజకవర్గ రైతులు కూడా ఉండడం వల్ల మంత్రి కాకాణి ప్రత్యేక కృషి చేసి పరిష్కరించారు. గతేడాది రైతులకు పాసుపుస్తకాలను సైతం మంత్రి చేతులమీదుగా అందజేశారు. ముత్తుకూరు మండలంలో మత్స్యకారేతర కుటుంబాలకు చెందిన వారికి నాన్ ఫిషర్‌మెన్ ప్యాకేజీ కూడా అందింది. ఇలా అర్హులైన వారికి రూ.36 కోట్లను మంత్రి తన చేతులమీదుగా అందజేశారు.

పారిశ్రామికాభివృద్ధి

సర్వేపల్లి నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపన జరుగుతూనే ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరిశ్రమల స్థాపన ఊపందుకుంది. నేలటూరు థర్మల్ విద్యుత్ ప్లాంట్‌తో పాటు, గతేడాది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెంకటాచలం మండలం సర్వేపల్లి గ్రామ పరిధిలో రూ.610 కోట్లతో క్రిబ్కో బయోఇథనాల్ ప్లాంట్, రూ.315 కోట్లతో విశ్వసముద్ర బయో ఇథనాల్ ప్లాంట్లను వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ముత్తుకూరు మండలం పంటపాళెంలో ఇటీవల మూడు పామాయిల్ ఫ్యాక్టరీలను మంత్రి కాకాణి ప్రారంభించారు. పొదలకూరు మండలంలో రెండేళ్ల క్రితం వ్యవసాయ పనిముట్లు, యంత్రాల తయారీ కోసం కిసాన్‌క్రాఫ్ట్ పరిశ్రమను రూ.100 కోట్లతో స్థాపించారు.

నియోజకవర్గంలో జరిగిన మేజర్ పనులు

- సర్వేపల్లి రిజర్వాయర్, కండలేరు హైలెవల్ కాలువ ఆధునికీకరణ
- సంగం, నెల్లూరు బ్యారేజీల నిర్మాణం ద్వారా సర్వేపల్లికి సాగునీరు
- ముత్తుకూరులో నాన్‌ఫిషర్‌మెన్ ప్యాకేజీకి రూ.36 కోట్ల నిధులు
- మనుబోలు వద్ద ఎన్‌హెచ్-16 హైవే పునర్నిర్మాణ పనులు పూర్తి
- వెంకటాచలంలో రూ.925 కోట్లతో క్రిబ్కో, బయో ఇథనాల్ ప్లాంట్లకు శంకుస్థాపన

రహదారుల ఆధునికీకరణ

మనుబోలు వద్ద ఎన్‌హెచ్ 16 హైవే పనులను రూ.135 కోట్లతో పునర్నిర్మాణం చేసి గతేడాది మంత్రి కాకాణి ప్రారంభించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో రూ.372 కోట్లతో మౌలిక వసతులైన అంతర్గత సిమెంటురోడ్లు, సైడ్‌డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేశారు. రాష్ట్రంలో ఎక్కడా జరగని విధంగా సర్వేపల్లిలో పనులు పూర్తికావడం గమనార్హం. రూ.120 కోట్లతో ఆర్‌అండ్‌బీ రహదారులు, వంతెనల నిర్మాణ పనులను పూర్తి చేశారు. ఒక్క పొదలకూరు మండలంలోనే ఆర్‌అండ్‌బీ శాఖకు రూ.30 కోట్ల పనులు జరిగాయి.



చుక్కల భూములకు పరిష్కారం చూపి రైతులకు పాసుపుస్తకాలను అందజేస్తున్న కాకాణి

వైఎస్సార్‌సీపీ వైపే ఆర్యవైశ్యులు



మాట్లాడుతున్న మంత్రి కాకాణి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : ఆర్యవైశ్యులు వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని, దశాబ్దాలుగా తమ కుటుంబంతో ఆర్యవైశ్యులకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొందరు విషప్రచారం సాగిస్తూ ఆర్యవైశ్యులను తనకు దూరం చేయాలని చూస్తున్నట్లు పేర్కొన్నారు. తన కుటుంబం నుంచి ఆర్యవైశ్యులను దూరం చేయడం ఎవరి తరం కాదన్నారు. గతంలో చిన్నపాటి సమన్వయ లోపం, కొందరు ఆడిన రాజకీయ క్రీడలో ఆర్యవైశ్యులు కొంత మనస్తాపం చెంది ఉండొచ్చని, వారికి ఎన్నో పర్యాయాలు తాను వ్యక్తిగతంగా, సభాముఖంగా వివరణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆర్యవైశ్యులతో తన తండ్రి కాకాణి రమణారెడ్డి బంధం ఈనాటిది కాదన్నారు. కన్యకాపరమేశ్వరి దేవస్థానానికి ఎన్నికల ముందు రావడం తనకు సెంటిమెంటుగా మారినట్లు చెప్పారు. ఇక్కడకు వస్తే తప్పకుండా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రిని పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు ఘనంగా సన్మానించారు. ముందుగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కుమార్తె పూజిత, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదూరు వెంకటసుబ్బయ్య, ఆకులూరు హేమంత్, అమరా భగవాన్, తరుగు ప్రభాకర్, తన్నీరు సుబ్రమణ్యం, దామిశెట్టి శ్రీనివాసులురెడ్డి, సుందరరాజా, చందు, రాచపూటి ధనుంజరావు, ఆకులూరు అనూరాధ, చాట్ల కోటేశ్వరరావు, త్యాగరాజు, చాట్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిలో టీడీపీకి భారీ షాక్



ఎమ్మెల్యే ప్రసన్న సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన మైనారిటీ కుటుంబాలు

- 50 ముస్లిం కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. పట్టణంలోని తొమ్మిదో వార్డు కౌన్సిలర్ ఎరటపల్లి శివకుమార్ ఆధ్వర్యంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో 50 ముస్లిం కుటుంబాలు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. బీజేపీతో టీడీపీ కలవడం ఇష్టంలేక తాము వైఎస్సార్‌సీపీలో చేరామని వారు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్న వారందరికీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం ఉంటుందని ఎమ్మెల్యే వారికి తెలియజేశారు. కార్యక్రమంలో బుచ్చి నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు మల్లికార్జునరెడ్డి, సతీష్‌రెడ్డి, పార్టీ నేతలు సీతారామిరెడ్డి, విజయ్ భాస్కర్‌రెడ్డి, అల్లాభక్షు, సల్మాన్, రఫీ, ఇస్మాయిల్, భరత్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారితో మంత్రి కాకాణి

పొదలకూరు : మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం సందర్భంగా పట్టణంలోని శ్రీహరి కాలనీకి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు కేఆర్‌ఆర్ నగర్‌లో ఆదివారం భారీగా వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. సోమిరెడ్డి సొంత పార్టీ వారికే కండువాలు వేసి వైఎస్సార్‌సీపీ నుంచి భారీగా చేరికలంటూ ప్రచారం చేసుకుంటున్నట్లు విమర్శించారు. 30 కుటుంబాలకు చెందిన వారు పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వార్డుసభ్యులు కండే వాసుదేవరావు, అంజాద్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

19 మంది వలంటీర్ల రాజీనామా

మనుబోలు : మనుబోలు మండలంలో ఇప్పటివరకు 19 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగితాలపూరు గ్రామంలో శనివారం ఒక్క రోజే ఎనిమిది మంది వలంటీర్లు రాజీనామా చేయగా వాటిని ఆమోదించినట్లు తెలియజేశారు. ఇప్పటికే మనుబోలు ఒకటో సచివాలయంలో ఒకరు, రెండో సచివాలయంలో ముగ్గురు, వీరంపల్లిలో ఏడుగురు వలంటీర్లు రాజీనామా చేశారన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటారు బైక్ ఆటోను ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో ఆదివారం జరిగింది. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన వెంకటనరసయ్య పని నిమిత్తం బైక్‌పై గొలగమూడి వచ్చాడు. తిరిగి బుచ్చిరెడ్డిపాళెం వెళ్తుండగా, గొలగమూడి పెట్రోల్ బంకు సమీపంలో ప్రమాదవశాత్తు ఆటోను మోటారు బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటనరసయ్యకు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం



వాహనదారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్

- చెక్‌పోస్టులతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట
- ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్

మనుబోలు : జాతీయ రహదారిపై మద్యం, నగదు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి ప్రశాంతంగా ఎన్నికలను నిర్వహించడమే లక్ష్యమని ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ అన్నారు. మండలంలోని బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును ఆదివారం రాత్రి ఎస్పీ ఆకస్మికంగా పరిశీలించారు. స్వయంగా పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎటువంటి అక్రమ రవాణాకు అవకాశం లేకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నామన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. ఎన్నికల నియమావళి అనుసరించి ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించినట్లు సమాచారం ఉంటే సీ-విజిల్ యాప్ ద్వారా లేదా టోల్ ఫ్రీ నంబర్ 112కు కాల్ చేసి తెలియజేయాలన్నారు. ఆయన వెంట ఎస్సై అజయ్‌కుమార్ ఉన్నారు.

నిజాయతీగా ఓటు వేయాలి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జైభారత్ ప్రతినిధులు

ఇందుకూరుపేట : ప్రతిఒక్కరూ నిజాయతీగా ఓటు వేయాలని జైభారత్ జాతీయ కార్యదర్శి లోక్‌నాథ్ కోరారు. మండలంలోని డేవిస్‌పేట నుంచి ఇందుకూరుపేట వరకు 'జస్ట్ ఓట్ క్యాంపెయిన్' కార్యక్రమంలో భాగంగా బైక్ ర్యాలీని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పేద, ధనిక, మధ్య తరగతుల మధ్య చాలా తేడా ఉందని, వాటిని బద్దలు కొట్టడమే జైభారత్ సంకల్పమని పేర్కొన్నారు. తొలుత డేవిస్‌పేట గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్తికేయ, తలారి నాగరాజు, వినయ్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఏపీ పాలన



ఇందుకూరుపేట: మైపాడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు



కోవూరు: ఎన్నికల ప్రచారంలో నాయకులు

ఇందుకూరుపేట : ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న సంక్షేమ పథకాలు, జరుగుతున్న అభివృద్ధి పనులు ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలుస్తున్నాయని, ఈ ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండలంలోని మైపాడులో స్థానిక సర్పంచ్ సంగం వెంకయ్యతో కలిసి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంగిటకే ప్రభుత్వ పథకాలను అందించడం దేశంలో ఎక్కడా లేదన్నారు. పార్టీలు, కులాలు, మతాలతో సంబంధం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. ఎలాంటి అవినీతికి అవకాశం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. అందుకే వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని, ఎంపీ అభ్యర్థిగా వేణుంబాక విజయసాయిరెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బట్టేపాటి నరేంద్రరెడ్డి, షేక్ షబ్బీర్, గూడూరు ప్రభాకర్‌రెడ్డి, గజ్జల లింగారెడ్డి, దేవరపల్లి పరంధామిరెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కోవూరు : దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏపీలో అర్హతే ప్రామాణికంగా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ జిల్లా చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి పందెం సుధా అన్నారు. మండలంలోని గుమ్మళ్లదిబ్బలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డిని, ఎమ్మెల్యేగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు సుప్రజ, వార్డు సభ్యుడు కమలాకర్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.